# చొప్పదండికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

- 500 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు
- మంత్రి కేటీఆర్‌కు జగిత్యాలలో ఎమ్మెల్యే రవిశంకర్ వినతి
- వెంటనే ప్రకటించిన అమాత్యుడు
- కొడిమ్యాలకు చెందిన 20 మంది బీఆర్ఎస్‌లో చేరిక

కొడిమ్యాల(మల్యాల), అక్టోబర్ 3: చొప్పదండి నియోజకవర్గానికి 500 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మల్యాల మండలంలోని నూకపెల్లి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. దీంతో వెంటనే 500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందిస్తామని చెప్పారు.

### పథకాలను చూసి పార్టీలోకి : ఎమ్మెల్యే సుంకె

కొడిమ్యాల, అక్టోబర్ 3: బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పార్టీలో చేరుతున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 20 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, స్వామి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

## సామాన్యులతో కలిసి అమాత్యుడి కూతురు..



కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న నందిని-అనిల్ దంపతులు

వెల్గటూర్, అక్టోబర్ 3: ధర్మపురిలో జరిగిన ప్రగతి నివేదన బహిరంగ సభలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కూతురు–అల్లుడు నందిని–అనిల్ దంపతులు సామాన్యుల గ్యాలరీలోనే నిల్చొని మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. మంత్రి కూతురు తమ పక్కనే ఉండి ప్రసంగం వింటుండడంతో ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఇదేనేమో అని ప్రజలు మాట్లాడుకోవడం కొసమెరుపు.

## దారులన్నీ ధర్మపురి వైపే



వెల్గటూర్, ఎండపల్లి మండలాల నుంచి వాహనాల్లో తరలుతున్న ప్రజలు

వెల్గటూర్, అక్టోబర్ 3: ధర్మపురిలో ప్రగతి నివేదన బహిరంగ సభకు వెల్గటూర్, ఎండపల్లి మండలాలల నుంచి సూమారు 6 వేల మంది ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ధర్మారం, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి తరలి వెళ్లే వాహనాలు వెల్గటూర్ నుంచి వెళ్లడంతో దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి.



పెగడపల్లి : మద్దులపల్లిలో ధర్మపురి కేటీఆర్ సభకు తరలుతున్న ప్రజలు

పెగడపల్లి, అక్టోబర్ 3: ధర్మపురిలో జరిగిన ప్రగతి నివేదన సభకు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో 50 బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో సుమారు 5 వేల మందికి పైగా ప్రజలు బహిరంగ సభకు తరలివెళ్లారు. మంత్రి కేటీఆర్ సభకు భారీ స్థాయిలో జనం తరలిరావడం, సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు

కథలాపూర్, అక్టోబర్ 3: జగిత్యాలలె మంత్రి కేటీఆర్‌ను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ నాగం భూమయ్య, వర్ధినేని నాగేశ్వర్‌రావు ఉన్నారు.

కొడిమ్యాల(మల్యాల), అక్టోబర్ 3: మల్యాల జడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్‌రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపెల్లి సుదర్శన్ మంగళవారం మంత్రి కేటీఆర్‌ను కలిశారు. నూకపెల్లి డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన కేటీఆర్‌ను కలిసి మండలంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## టీఎన్జీవోల వినతి

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 3: ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించడం హర్షణీయమని, మధ్యంతర భృతిని మరికొంత పెంచాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవోలు మంత్రి కేటీఆర్‌ను జగిత్యాలలో కలిసి విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రయోజనాలన్నీ సీఎం పరిష్కరిస్తారని మంత్రి కేటీఆర్ తెలిపారని టీఎన్జీవోలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీవోలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి, సంఘ నాయకులు సాహిద్ బాబు, రవీందర్, రాజేందర్, మధుకర్, సుగుణాకర్, నగేశ్, శైలజ, శ్రావణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మండలానికి చేరిన బతుకమ్మ చీరెలు

గంగాధర, అక్టోబర్ 3: రాష్ట్రంలోని మహిళలు బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవడానికి వీలుగా ప్రతి సంవత్సరం ప్రభుత్వం బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నదని. ఈ ఏడాది మండలంలో పంపిణీ చేయడానికి సర్కారు మంగళవారం తహసీల్ కార్యాలయానికి 12300 చీరెలను పంపించింది.





అధికారులు పట్టుకున్న నగదు, పట్టుబడిన ఆర్ఐ తిరుపతి

## ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

- మరో వ్యక్తిగత సహాయకుడు
- రూ. 15 వేలు తీసుకుంటుండగా పట్టివేత
- మెట్‌పల్లి తహసీల్ కార్యాలయంలో కలకలం

మెట్‌పల్లి, అక్టోబర్ 3: ఏసీబీ వలకు మరో అవినీతి చేప చిక్కింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర (నాలా కన్వర్షన్) భూమిగా రికార్డులో బదలాయింపు కోసం ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (గిర్దావర్) తిరుపతి, అతడి ప్రైవేట్ అసిస్టెంట్ భూరం ప్రవీణ్ రైతు నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ ఘటన మంగళవారం మెట్‌పల్లి తహసీల్ కార్యాలయంలో జరిగింది. ఏసీబీ కరీంనగర్ ఇన్‌చార్జి డీఎస్పీ వీవీ రమణామూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం మేడిపల్లికి చెందిన బద్దం లక్ష్మి పేరిట అదే గ్రామ శివారులోని 797/ఉ/1 అనే సర్వే నంబర్‌లో 7 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో లక్ష్మి కొడుకులు ఇండ్లు నిర్మించుకోవాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వ్యవసాయేతర భూమిగా బదలాయింపు కోసం బద్దం లక్ష్మి, ఆమె భర్త శంకర్‌రెడ్డి గతనెల 22న మీ సేవ ద్వారా ధరణిలో దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేయమని తహసీల్దార్ ఆర్ఐ తిరుపతిని ఆదేశించారు. ఆయన కాలయాపన చేస్తుండడంతో శంకర్‌రెడ్డి ఆర్ఐని కలిసి అడుగగా తనకు రూ.20వేల లంచం ఇస్తేనే పని అవుతుందని చెప్పడంతో చేసేదేమిలేక రూ. 15 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. కానీ లంచం ఇవ్వడం ఇష్టం లేని రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఏసీబీ అధికారులు తహసీల్ కార్యాలయం వద్ద మాటు వేశారు. డబ్బులు తన సహాయకుడు భూరం ప్రవీణ్‌కు ఇవ్వమని చెప్పడంతో సదరు రైతు ఆ డబ్బులను ప్రవీణ్‌కు అప్పగించాడు. అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి పట్టుకున్నారు. ఆర్ఐతో పాటు అతడి వ్యక్తిగత సహాయకుడిని అదుపులోకి తీసుకొని రూ.15 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఏసీబీ కరీంనగర్ ఇన్‌చార్జి డీఎస్పీ రమణామూర్తితో పాటు సీఐలు రవీందర్, జాన్‌రెడ్డి, రాములు, తిరుపతి పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

గంగాధర, అక్టోబర్ 3: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని కురిక్యాల శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆయా గ్రామాల్లోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని పంణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువతను క్రీడల వైపు మళ్లించి, శారీరక, ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ప్రభుత్వం గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. యువత కోసం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ సర్కారుకే దక్కుతుందన్నారు. యువత క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి కిట్‌లో రూ. 10 లక్షల విలువైన క్రీడా పరికరాలు ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 150 కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీలత, స్పోర్ట్స్ అధికారి రాజవీరు, చొప్పదండి మున్సిపల్ చైర్మన్ గుర్రం నీరజ, ఎంపీపీలు పర్లపెల్లి వేణు, చిలుక రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు లోకిని ఎల్లయ్య, లెంకల సత్యనారాయణరెడ్డి, గడ్డం చుక్కారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు సర్కార్ కానుక బతుకమ్మ చీరెలు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- మెట్‌పల్లి ఎంపీపీ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరెల పంపిణీ



మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 3: తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగకు చీరెలను కానుకగా ఇస్తున్నారని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మంగళవారం మెట్‌పల్లి ఎంపీపీ కార్యాలయ ఆవరణలో మహిళలకు బతుకమ్మ చీరెలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మహిళలకు గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, బీడీ కార్మిక, ఒంటరి మహిళలకు పింఛన్ వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు సంతోషంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగను సైతం అధికారికంగా నిర్వహించి బతుకమ్మ చీరెలను అందజేస్తున్నారని పేర్కొన్నారు.

### యువకులకు క్రికెట్ కిట్ల పంపిణీ

కొండ్రికర్ల గ్రామానికి చెందిన యువకులకు క్రికెట్ కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. యువత చదువుతో పాటు క్రీడాల్లో రాణించేందుకే కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఎంపీడీవో భీమేశ్ రెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, విట్టంపేట సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు నోముల గంగాధర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్లా తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి, పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు మెండె రమేశ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మల్లాపూర్, అక్టోబర్ 3: కొత్తదామరాజుపల్లి గ్రామంలోని స్థానిక జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడంతోపాటు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. ఇక్కడ పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

## గజానన్ తామన్ మృతికి సాహితీ వేత్తల సంతాపం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 3: తెలుగు, మరాఠీ, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్, బెంగాలీ, గుజరాతి, సంస్కృత భాష పండితుడు గజానన్ తామన్ మంగళవారం ఉదయం మృతి చెందగా పలువురు సాహితీ వేత్తలు, కవులు సంతాపం వ్యక్తం చేశారు. గజానన్ తామన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మంథనికి చెందినవారు. గజానన్ చిత్రపటం వద్ద సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్త అనిల్ కుమార్, గండ్ర లక్ష్మణరావు, నలిమెల భాస్కర్, దాస్యం సేనాధిపతి, మాడిశెట్టి గోపాల్, వేణుశ్రీ, కేఎస్ అనంతాచార్య, అన్నవరం దేవేందర్, గాజుల రవీందర్ నివాళులర్పించారు